# వజ్రహస్తం

చెపుతాను, చెప్పమంటున్నారా? వినండి. ఏం చెప్పను! ఏం చెప్పను!

వొద్దు వొద్దు! మహాప్రభూ ఈ శిక్ష శత్రువుకి కూడా వొద్దు!

ఏదో అనుకుంటాం. అంతా మనచేతిలో ఉన్నట్టు! మన చేతిలో ఏమీలేదు. అంతా వాడి చిద్విలాసం.

అంతా ఏమనుకున్నారు? సరి పని వీడి పని సరి! నువ్వేమను కున్నావు? వాడు? వాడు? వాడేమనుకున్నాడు. సరి సరే అనుకున్నారు!

ఉరితాడు పీక మెయ్యా బిగించారు. బిగిసిపోతూ ఉరి! ఉరిశిక్ష కాని ఉరిశిక్ష. బతికి ఉండాలి. క్షణక్షణం ఉరితాడు బిగిస్తూ చంపుతూ వుండాలి. వాడు చక్రం అడ్డువేసి ఉరితాడుని ముక్కముక్కలు చెయ్యకపోతే? వొద్దు. శత్రువుకి కూడా ఈశిక్ష వొద్దు.

మూడు సంవత్సరాలు! భగవంతుడే పరీక్షలో పెట్టాడు. అబ్బబ్బ! అంత పరీక్షా! నిలబడతాను లేదా? నిలబడ్డాను! పరీక్షకి తట్టుకున్నాను.

భగవంతుడు మన పక్షం వున్నప్పుడు కౌరవ అక్షౌహిణీలు మననేం చేస్తాయి?

నువ్వు తప్ప ఇంక శరణులేదు సుమా అన్నాను. పట్టుకున్నాను.

ప్రతిక్షణం 'భగవాన్ భగవాన్' ఆత్మ ఘోష పెడుతూనే వుంది. ఎదురుగా కనబడుతూనే ఉన్నాయి ఏడుకొండలవాడి వజ్రహస్తాలు. వరదా! తండ్రీ ఏదీ నీ వరం? అభయం! ఇక భయంలేదు. ఉంది ఉంది తండ్రీ నీ అభయహస్తం! నీ వజ్రహస్తం!

భగవాన్! నీ చక్రముండగా ఏ మకరం పట్టుకోగలదు!

కనబడుతూనే ఉన్నాయి. మూడేళ్ళు అనుక్షణం కనబడుతూనే ఉన్నాయి. ఏడుకొండలవాడి వజ్రహస్తాలు! ఒకటి అభయం చెపుతున్నాది.

ఒకటి వరం ఇస్తున్నాది. తెలుస్తూనేవుంది. ఇది భగవంతుడు చేస్తున్న పరీక్ష, వేరొకటి కాదు.

నేనేం నేరం చేశాను? నే చేసిన ఏ పనీ నేరంకాదు. నేరమైతే ఎవడు చెయ్యడు? నా పదవిలో ఉన్నవాడు ఎవడు చెయ్యలేదు? నా దృష్టిలో అంతా చేస్తున్నారు. చట్టాలు అలాగ్గా తగలేసుకున్నారు.

అక్కన్న మాదన్న లేంచేశారు? గోలుకొండ నవాబుగారి రాజ్యంలో అక్కన్న మాదన్నలకి కొన్ని లక్షలు ఇంగ్లీషువారు నజరానా ఇవ్వలేదా! నజరానా అంటే ఏమిటి? లంచమంటే ఏమిటి?

పదవిలో వున్నవాడి కాళ్ళు పట్టుకుంటారు. చేతిలో పెడతారు. తప్పా? చెప్పండి. అధికారం లేనివాడు, ఏం చెయ్యగలడు? పిదకలు! అధికారం ఉంది! ఒప్పిపడతారు. నువ్వు భగవంతుడివి అంటారు. అధికారి భగవంతుని అంశ కలవాడు. రాజు! నా విష్ణుఃపృథివీపతి!

చట్టం ప్రజలకోసం. ప్రజలని అదుపులో ఉంచటానికి చట్టం. రాజుకోసమా చట్టం? రాజు చేసిన చట్టాలు ఏనాడైనా రాజుకి వర్తించాయా? వర్తిస్తాయా?

ఈనాడు రాజస్థానంలో ప్రజాస్వామ్యం ఉంది. ప్రభుత్వాన్ని నడుపుతున్న వర్గం ఉంది. చట్టం ప్రజలకోసం. ప్రభుత్వవర్గంకోసం కాదు.

వింటున్నారా? ఇవి ఉన్నతమైన రాజకీయ విషయాలు. అంతర్గతమైన మహా రహస్యాలు.

మోపు చేసేశారు! నామీద కొచ్చింది. అక్రమంగా డబ్బు పుచ్చుకుంటున్నానుట! చేసుకొన్నానుట! రుజువు చేస్తారుట!

సస్పెన్షన్! ఉద్యోగంనుంచి సస్పెన్షన్ ఉత్తర్వు జారీ అయింది. ఐదేళ్ళలో పెన్షన్ పుచ్చుకోవలసినవాడికి సస్పెన్షన్!

నేరం రుజువైతే ఏం జరిగేది? ఉద్యోగం నుంచి బర్తరఫ్. అంతే అయితేనా? పూతికతో సమానం. కాదే! జైలుశిక్ష పడుతుంది.

జైలుశిక్షపడితే బతకడం బతకడమా! చెప్పండి!

ఉచ్చులో పడ్డ మరుక్షణం చుట్టూ అంతా శత్రువులే! ఒక్కడు మాటలాడ్డు! ఒక్కడు కనబడ్డు! ఇంటికి వెళ్ళి దేముడు పట్టు కెదురుగా

నిలబడి చేతులు జోడించి "ఏడుకొండలవాడా! వెంకటరమణా! రక్షించు రక్షించు! శరణు తండ్రీ శరణు శరణు!"

శరణుజొచ్చాను. కళ్ళమ్మడి నీళ్ళు కారిపోతున్నాయి. వొళ్ళు గడ గడలాడిపోతున్నాది. శివజ్వరంతో కుదుపు పట్టుకొన్నాది. నా పెళ్ళాం లెంపలు వాయించుకుంది.

"కాపాడు తండ్రీ కాపాడు! నా భర్త పొరపాట్లు క్షమించు. ఆయన పైకి ఏం చెప్పినా మీ దాసానుదాసుడు. రక్షించు, రక్షించు, మహాప్రభో నువ్వు తప్ప మాకెవరూలేరు. నీ కొండ కొస్తాము. పిల్లలందరితో వస్తాను. ఏడుకొండలూ ఎక్కివస్తాను. నా వొంటిమీద నగలన్నీ నిలువుదోపు ఇస్తాను. ఇప్పుడే నీకు ముడుపు కడతాము. మహాప్రభో, మహాప్రభో" అని ఏడుస్తూ అది ముక్కుపుడక లగాయితు నగలన్నీ తీసేసింది. పుస్తెలు తీసేసి పసుపుకొమ్ములు కట్టుకొంది. నగలన్నీ మూటకట్టి ముడుపు కట్టింది.

ఇదంతా ఏమిటంటారు? భగవంతుడు నన్ను చేస్తున్న పరీక్ష. ఏమీ సందేహం లేదు.

బ్రాహ్మణ్ణెప్పుడైనా పిలిచానా? నా చుట్టుపక్కలకి రానిచ్చానా. పూజా పునస్కారాలు చేయించానా! ఎన్ని అపభ్రంశం మాటలన్నాను? ఎన్ని తిట్లు తిట్టేను!

నేనేనా? వాణ్ణేనా నేను? నేను ఉన్నాను సుమా అన్నాడు భగవంతుడు. నీ పోత్రం నా దగ్గర కాదన్నాడు. దాసోహం కమ్మన్నాడు. "దాసోహం. దాసోహం" అన్నాను.

జ్వరం, మహాజ్వరం, శివజ్వరం! క్షణం ఒక యుగం. రోజు ఘనీభవించి శిల కట్టుకు పోతున్నాది. శిలాభారంతో తల వ్రయ్యలై పోతున్నాది. ఏమిటి సాధనం!

సద్బ్రాహ్మణులని పిలిచి గ్రహ పూజలు, గ్రహ శాంతులు, గ్రహ జపాలు చేయించాను. శివాలయంలో ప్రతి సోమవారం వంద కొబ్బరి కాయలు కొట్టిస్తూ రుద్రాభిషేకాలు చేయించాను.

ఉదయం స్నానం చేసి, పచ్చి మంచినీళ్ళు ముట్టుకోకుండా, పట్టు పంచ కట్టుకొని పీటమీద కూర్చుని రామాయణం తీసి సుందరకాండ పారాయణం రోజూ చేశాను. నిత్యం.

మహత్తు ఉందన్నారు. మహత్తు ఉంది. మూడేళ్ళు ఎలాగ్గా గడిచాయి? నిముషం నిముషం చొప్పున మూడేళ్ళు గడిచాయి. నిమిషమంటే మాటలా? ప్రతి నిమిషం అరవై బ్రహ్మచెముడు ముళ్ళగుబురు! ఎలాగ్గా గడిచాయి?

ఏడు కొండలవాడి వరదహస్తం ఎదురుగా వుంది. ఏడుకొండలవాడి అభయహస్తం ఎదురుగుండా ఉంది. ఏడుకొండలవాడి వజ్రహస్తాలు కాపాడుతూ కనబడుతూనే ఉన్నాయి.

నాతో అయిందా! నా స్నేహితుడి మీది కొచ్చింది. చిత్రం! శ్రీమన్నారాయణ మీది కొచ్చింది!

చెప్పండి, మీరంతా చెప్పండి. శ్రీమన్నారాయణ ఎవడు? మామ్మూలు వాడా? సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. ప్రజలను ఆపదలలో ఆదుకొనేవాడు. ప్రజల మధ్య పనిచేస్తున్నవాడు. ప్రజల నోట్లో నాలిక లాంటివాడు. మహా మేధావి, రాజకీయాల్లో ఆరితేరినవాడు. ఊరికి ఉపకారి. తాలూకాకి ఉపకారి. జిల్లాకి ఉపకారి. రాష్ట్రానికి ఉపకారి.

ఔనంటారా ?

పెరిగిపోతున్నాడు శ్రీమన్నారాయణ. విష్ణు అంశతో పెరిగిపోతున్నాడు. మొహంలో రాజవర్చస్సు కనబడి పోతున్నాది. రాష్ట్ర స్థాయికి వచ్చేశాడు. దేశం మొత్తంమీద వినబడుతున్నాడు. అన్ని హంగులూ ఉన్నవాడు. మంత్రి కావలసినవాడు. ముఖ్యమంత్రి కావలసినవాడు! ప్రధాని కాదగ్గవాడు.

మీకేం తెలుసు? నాకు తెలుసు! చిన్ననాటి నుంచి నా స్నేహితుడు. ఏమి ఘోరకలి! వాణ్ణి ఇరికించేరు! ఖూనీకేసులో! ఖూనీ చేయించాట్ట! పక్కలో బల్లెంలాగ ఉన్న రాజకీయ శత్రువుని నక్సలైట్ల మీదికి నెట్టుకుపోతుందని - ఖూనీ చేయించాట్ట.

తాను చేయలేదు. ఔనా? చేయించాట్ట. శత్రువుని సంహరించమనే చాణక్యనీతి. రాజరికంలో అడ్డంగా ఉన్నవాణ్ణి అడ్డంగా నరికేయడమే న్యాయం.

ఔనంటారా? కాదంటారా? వెనకనుంచి వెన్నుపోటు పొడవడానికి పొంచున్న శత్రువుని పిట్టని కొట్టినట్టు కొట్టాడ్డా!

కొట్టేడా? కొట్టించాట్ట : చూసినవాడు లేడు! టటట! అంతా టటట! తెలిసినవాడు లేడు!

నా తల వెయ్యి చెక్కలై నే చస్తున్నాను. శ్రీమన్నారాయణ కేసుతో నా నడుం జారిపోయింది.

ఈ శిక్ష శత్రువుకి వొద్దు భగవంతుడే మా యిద్దర్నీ పరీక్షలో పెట్టాడు. పరీక్షకి తట్టుకుంటామా లేదా పరీక్ష చేస్తున్నాడు.

నట్టేట్లో పడిపోయాము. నది సముద్రానికి కొట్టుకుపోతున్నాము. కళ్ళు మూసుకున్నా, కళ్ళు తెరిచినా అభయహస్తం కనబడుతున్నాది. వరద హస్తం కనబడుతున్నాది. వజ్రహస్తాలు కనబడుతున్నాయి. తీర్పు వొచ్చేసింది. మీరంతా ఆనందం పట్టలేకపోయారు. నా నేరాలు రుజువు కాలేదు! నే నేరం చేయలేదు! భగవంతుని విలాసం. ఏడుకొండలవాడి చక్రప్రయోగం. చక్రి ఆ చక్రం!

వెంటనే ఆ వెంటనే ఉన్న రైలుకి ప్రయాణం కట్టేశాం ఏడు కొండలవాడి సన్నిధికి.

కీళ్ళనొప్పులతో నా పెళ్ళాం మెట్లెక్క పోయింది. ఇచ్చేశాడు భగవంతుడు దానికి ఏనుగంత శక్తి. పిల్లలు ఛంగు ఛంగుమని కోతుల్లాగ గెంతుతూ పోయారు.

నిన్ను పరీక్షలో పెట్టేడా భగవంతుడు. నవనాళ్ళూ తోడుకుపోతూ శరీరభారం మొయ్యలేక మెట్టు మెట్టు ఏడుకొండలవాడి స్మరణ చేస్తూ ఎగబడ్డాను.

నా శక్తికి మించిపోయి కొండలు కనబడుతున్నాయి. తండ్రీ నన్నెలాగ తీసికెళతావూ నీ చరణ సన్నిధికి, అని వాడి మీదే భారం వేసి ఎగబడగా గాలిగోపురం చేరుకున్నాను. నడవగా నడవగా మోకాలి పర్వతం చేరుకున్నాను.

చూడండి. బాధగా ఉంటే “ఏడుకొండలవాడా గోవిందా గోవింద” అంటూ నామస్మరణ అన్ని వైపులనుంచి, మీదనుంచి, కిందనుంచి వొస్తూ వుంటే నాకు తెలియకుండా శరీరాన్ని మోసుకుపోయాను.

మోచేతులతో, మోకాళ్ళతో వొగురుస్తూ, ఎగబడుతూ మోకాలి పర్వతం ఎక్కేను. ఎక్కిపోయాను. కొండెక్కిపోయాను. “భగవాన్,

నీ సన్నిధానానికి వచ్చాను. ఏడుకొండలవాడా గోవిందా గోవిందా" నామ స్మరణ చేసుకున్నాను.

కాటేజ్ పుచ్చుకున్నాను. అందరం స్నానాలు చేసి కళ్యాణ కట్టకి పోయాం. నేనూ, నా పెళ్ళాం పిల్లలంతా కేశ సమర్పణ చేసుకున్నాం.

అణగిపోయింది నా పోత్రం, అణగిపోయింది నా అహం. ప్రాయశ్చిత్తమై పోయింది. నా పెళ్ళాం నిలువుదోపు అర్పించుకుంది.

"నువ్విచ్చిందే తండ్రీ, నాదేం కాదు. నీది నీకే ఇస్తున్నాను మహాప్రభో" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది మహదానందంతో! ఏడుకొండల వాడికి, కళ్యాణం చేయించి దర్శనం చేసుకొని, ప్రసాదం తిని కాటేజీ కొచ్చాను.

నన్ను బాధ పెడుతున్నది శ్రీమన్నారాయణ కేసు ఏమైంది? భగవాన్ వాణ్ణి రక్షించు నన్ను కాదు. నేను కాదు వాడు-రక్షించ దగ్గవాడు. ముఖ్యమంత్రి కాదగ్గవాడు. ప్రధాని కాదగ్గవాడు. కుట్రలో ఇరుక్కున్నాడు. ఖూనీకేసులో! ఖూనీ చేయించాడని! రక్షించు తండ్రీ రక్షించు!

వాడికోసం నా ప్రాణం తహతహ లాడిపోతున్నాది.

చూశావా! వింటున్నావా! నాకు భగవంతుడు కనబడుతున్నాడు. మీకో? మీకు కనబడుతున్నాడా ?

చూశారా! మీ వొళ్ళు గగుర్పొడుస్తున్నాది! భక్తితో వుంది స్వామి శక్తి.

కాటేజీకి పోయి నా వేషం నేను వేసుకొన్నాను. నా కోటు, నా ఫేంటు, నా హేటు. నేనెవణ్నో ఇప్పుడు చూడండి. ఫస్టుక్లాసు ఆఫీసర్ని. నేను నేనయ్యాను ! మూడేళ్ళ తర్వాత ఏడుకొండలవాడు ఏడుకొండలు దాటించాడు. తన సన్నిధానంలో ఆఫీసరుగా, ఏడుకొండలవాడి భృత్యుడిగా నిలబడమన్నాడు. కాటేజీ ఎదురుగా నిలబడ్డాను.

చిత్రం చూడండి!

ఎదురుగా కనబడుతున్న దృశ్యం ఏమిటి ? ఎవరిది ? ఎవరో మహానుభావుడు, మహాభక్తుడు! ఏదో అర్థించి నా కాటేజీకి వచ్చాడు. ఎవరో చెప్పేశారు నేను ఆఫీసర్నని.

"ఏడుకొండలవాడా గోవిందా, గోవిందా" అని కేక పెట్టాడు. వాడి బుర్ర నల్లగా, ఇనుప గుండులా వుంది. తల మీసాలు గెడ్డం నున్నగా గీయించుకున్నాడు. నుదుటినిండా నుదురునిండిపోయి నామం పెట్టుకున్నాడు. చిన్న అంగవస్త్రం కట్టుకుని జాంబవంతుడిలాగ నిలబడ్డాడు. భయోత్పాతం కలిగించే రూపం, మహా భీభత్సమైన విగ్రహం! నా దగ్గిరికి ఏం కావలసి, ఏ కోరికతో వచ్చాడు! ఏడుకొండలవాడే కాని, ఆ ఉగ్రరూపంలో నా దగ్గరకు రాలేదుకదా! భ్రాంతిలో పడిపోయాను. జాంబవంతుడంత మనిషి జాంబవంతుడిలా ఉన్నాడు. నన్ను పరీక్ష చెయ్యడానికి వెంకటరమణుడే ఆ రూపంలో రాలేదు కదా! నుదుటిమీద నామం ధగ ధగ లాడుతున్నాది. శరీరం నలుపు నిగ నిగ లాడుతున్నాది.

"స్వామీ తమకేం కావాలి?" అని అడిగాను. పిల్లలు వచ్చి బిక్కు బిక్కు మంటున్నారు.

"ఏడుకొండలవాడి అనుగ్రహం కావాలి నాయినా" అన్నాడు.

వింటున్నావా! వాడి అనుగ్రహం కావాలి! "చిత్తం! తమకేం కావాలి?" అని అడిగాను. వాడేమడిగినా భక్తుడయినా, దొంగభక్తుడయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

"నేన్రా! నేన్రా!" అన్నాడు.

"శ్రీమన్నారాయణగారండీ" అంటూ లోపల్నుంచి నా పెళ్ళాం బయటకు వచ్చేసింది. నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. శ్రీమన్నారాయణుని వివస్త్రుడై వుండగా నేనెప్పుడైనా చూశానా? పిసరంత పోల్చలేకపోయాను. మొహంనిండా బొద్దు మీసాలు, తలనిండా ఉంగరాల జుత్తు, తెల్లటి చొక్కా, తెల్లటి పంచె, తెల్లటి సిగరెట్టు, కారులోంచి దిగి నా ఇంటికి వచ్చే శ్రీమన్నారాయణ రూపు ఎక్కడ? భగవత్సన్నిధానంలో ప్రాయశ్చిత్తం చేసుకుని అంగవస్త్రంతో నిలబడ్డ శ్రీమన్నారాయణ ఎక్కడ ?

ఆనందబాష్పాలతో కౌగిలించుకున్నాము. భగవంతుడు వాణ్ణి రక్షించేడు. బయటపడ్డాడు. నావెనకే వచ్చాడు. నాతోటే వచ్చాడు. హుటాహుటీ మొక్కు చెల్లించుకుంటానను కొన్నాను. హుటాహుటీ వచ్చేశాను

"ఏడుకొండలవాడా! ఏ లీలను ఎవరిని ఎందుకు కాపాడుతావో ఎవరికి తెలుసునయా? ఏడుకొండలవాడా!"

నన్ను రక్షించావు. శ్రీమన్నారాయణని రక్షించావు. దేశానికి కావలసినవాడు, ప్రజలకు కావలసినవాడు, వాణ్ణి రక్షించావు" అని స్తవం చేశాను.

పరమేశ్వరుని నిర్ణయాలు పామరులకి బోధపడవు!